
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 18 మే 2024



24న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, మే 17: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 24న నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రిసైడింగ్ అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరు కావాలని కౌన్సిల్ సభ్యులకు నోటీసులు అందజేశారు. బీఆర్ఎస్‌కు చెందిన ఆకుల యాదగిరిపై కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానం పెట్టి ఆయనను పదవి నుంచి దింపేశారు. ఇప్పుడు వైస్ చైర్మన్‌గా బర్ల మంగ ఎన్నికయ్యే అవకాశం ఉంది.

పాఠశాలల పున: ప్రారంభం నాటికి
యూనిఫాం అందిస్తాం

▸ జిల్లా కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి రంగారెడ్డి అర్బన్, మే 17 : పాఠశాలలు పున: ప్రారంభం అయ్యేనాటికి జిల్లాలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టించి సకాలంలో అందిస్తామని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శశాంక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు 82,306 యూనిఫామ్స్, యూఎల్‌బీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు 47,722 యూనిఫామ్స్, జీహెచ్ఎంసీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు 50,131 యూనిఫామ్స్, మొత్తంగా లక్షా 80 వేల 159 యూనిఫామ్స్‌ను కుట్టించి సకాలంలో అందించేందుకు అవసరమైన టైలర్‌లను గుర్తించామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు పున: ప్రారంభం నాటికి యూనిఫామ్స్ తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, డీసీసీఓ ధాత్రిదేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు మనోహర్ రాథోడ్, విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆహా.. ఏమి చిత్రం!



సమయం శుక్రవారం సాయంత్రం 6.45 నిమిషాల సమయం. ఆకాశంలో ఒక్కసారిగా మార్పులు. ఓ పక్క మబ్బులు కమ్ముకున్నాయి. మరో పక్క ఆకాశం ఎర్రగా మారింది. సూర్యుడు అస్తమించే సమయంలో ఆకాశంలో దర్శనమిచ్చిన ఆ రంగులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆకాశంలో ఇలాంటి మార్పులను తాము ఎన్నడూ చూడలేదని స్థానికులు తెలిపారు. ఆకాశంలో ఆవిష్కృతమైన ఈ అద్భుతం కనువిందు చేసిందని అభిప్రాయపడుతున్నారు.

- యాచారం, మే 17





రైతు రుణాలను మాఫీ చేసేందుకు రాష్ట్ర సర్కారు వేగంగా కసరత్తు చేస్తోంది. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకకాలంలో రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు కూడా పూర్తి కావడంతో దీనిపై దృష్టి పెట్టింది. ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు కోసం బ్యాంకర్లు వివరాలు సేకరిస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఉన్నాయి. దీంతో రుణ మాఫీ ప్రక్రియను ఆగస్టు 15నాటికి పూర్తి చేసి ఆ తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రుణమాఫీపై ఇప్పటికే అత్యున్నత స్థాయిలో సమావేశం నిర్వహించిన సర్కారు దీనిని త్వరలోనే అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టింది.



రుణమాఫీకి కసరత్తు!

లెక్కలు తేల్చే పనిలో సహకార బ్యాంకు అధికారులు

- బ్యాంకర్ల నుంచి వివరాల సేకరణ
- ఆగస్టు 15వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సర్కారు
- దానికోసం వేగంగా అడుగులు
- 2019 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 డిసెంబర్ 10 వరకు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తింపు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా ఇంతవరకు రుణమాఫీపై ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత రాలేదు. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడంతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మరికొంత స్పష్టత ఇచ్చారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో తాండూరుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. అంతేకాదు... ఇచ్చిన హామీ తప్పక నెరవేరుస్తానంటూ అనంత పద్మనాభస్వామి ఆలయం మీద ప్రమాణం కూడా చేశారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కావడంతో సీఎం రుణమాఫీపై దృష్టి సారించారు. దీనిపై రెండు రోజుల కిందట అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రుణమాఫీ కోసం కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా చర్చించారు. మరో వైపు రుణమాఫీకి అర్హత ఉన్న రైతుల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. రుణమాఫీ కోసం అర్హుల జాబితాను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర సహకార బ్యాంకు అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ఆదేశాలతో సహకార బ్యాంకు అధికారులు రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఏఏ బ్యాంకుల్లో రైతులు రుణాలు ఎంతెంత తీసుకున్నారు? ఇందులో రూ. 2లక్షల లోపు రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఎంత? వడ్డీ ఎంత అనే వివరాలను బ్యాంకర్ల నుంచి తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే రుణమాఫీ అమలు కోసం ప్రభుత్వం కటాఫ్ డేట్ పెట్టింది. దీని ప్రకారం 2019 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 డిసెంబర్ 10 వరకు బ్యాంకుల నుంచి రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న వారంతా రుణమాఫీకి అర్హులే. వీరందరి వివరాలను బ్యాంకర్లు సేకరిస్తున్నారు. ఇదిలా ఉంటే రుణ మాఫీ ప్రక్రియ పూర్తయిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. ఇందువల్ల నిధులు సేకరించి రైతులకు వెంటనే రుణమాఫీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించనున్నారు.

లక్ష మందికి పైగా లబ్ధి!

రుణమాఫీ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా రైతులకు ప్రయోజనం కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 3,11,753 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. వీరికి మూడు విడతలుగా మాఫీ చేశారు. ఇంకా మిగిలిన వారు సుమారు రూ.లక్ష మందికి పైగా ఉంటారని అంచనా. వీరిలో రూ. లక్షకు పైగా రుణాలు తీసుకున్నవారే అధికంగా ఉన్నారు. అంతేకాక గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రుణమాఫీ ప్రకటించింది. అదే సమయంలో ఇపుడు రూ. 2లక్షలు రుణం తీసుకున్నా మాఫీ చేస్తామని రైతులకు రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీని తరువాత అనేక మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. ఈ వివరాలను అధికారులు సేకరించాల్సి ఉంది. దీంతో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే ఇంకా పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తే లబ్ధిదారుల సంఖ్య కచ్చితంగా నిర్ధారణవుతుంది.

గత ప్రభుత్వం హయాంలో ...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా రుణమాఫీ హామీపై హామీ ఇచ్చినా ఇంత వరకు పూర్తిస్థాయిలో ఇంకా నెరవేరలేదు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ప్రకటించింది. 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2018 డిసెంబర్ 11 తేదీల మధ్య రుణం తీసుకున్న వారికి ఇది వర్తిస్తుందని పేర్కొంది. తొలి విడత రూ. 25వేల లోపు ఉన్న వారికి మాఫీ చేసింది. అలాగే రెండో విడత రూ. 50వేల లోపు ఉన్న వారికి మాఫీ సక్రమంగానే చేసింది. మూడో విడత రూ.50 నుంచి రూ. లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించినా అందరికీ రుణమాఫీ జరగలేదు. ప్రభుత్వం రుణమాఫీ చేసిన వారికి కూడా పెద్దగా ప్రయోజనం కలగలేదు. రుణమాఫీ చేస్తారనే ఉద్దేశంతో తీసుకున్న రుణాలు చెల్లించక పోవడంతో చివరకు రైతులకు వడ్డీ భారం తడిసి మోపెడయ్యింది. సర్కార్ ఇచ్చిన మాఫీ సొమ్ము కొందరు రైతులకు వడ్డీలకే సరిపోయింది. ఆధార్ కార్డు లింక్ కాకపోవడం, పాస్‌బుక్‌ల్లో తప్పిదాలు జరిగిన కారణంగా కొందరికి రుణమాఫీ దక్కలేదు. అలాగే రుణాలు రీషెడ్యూల్ చేయని వారికి కూడా రుణమాఫీ ఇవ్వలేదు.



చేవెళ్లలో వెబ్‌కాస్టింగ్ స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్

స్ట్రాంగ్‌రూంల పరిశీలన

▸ ఈవీఎంలు భద్రపరిచిన కళాశాలను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్

ఆంధ్రజ్యోతి రంగారెడ్డి అర్బన్, మే 17 : వెబ్‌కాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా స్ట్రాంగ్ రూంలను రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపర్చిన ఈవీఎంలను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి లోకేష్ కుమార్ పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ ముగిసిన అనంతరం మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ యంత్రాలను బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపర్చారు. ఆ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా లోకేష్‌కుమార్ ఒక్కో స్ట్రాంగ్ 'హంను వెబ్ కాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం, వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల, రాజేంద్రనగర్ ఆర్డీవోలు సాయిరాం, వెంకటరెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాతో చెరువుల వివరాలను చిత్రీకరిస్తున్న అధికారులు

చెరువుల పునరుద్ధరణతో రైతులకు మేలు

చౌదరిగూడ, మే 17: చెరువుల పునరుద్ధరణతో రైతులకు మేలు జరుగుతుందని, వర్షాకాలంలో చెరువులోకి భారీగా నీరు రావడంతో భూగర్భజలాలు పెరుగుతాయని ఏపీడీ చరణ్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని గాలిగూడ, ఎల్కగూడ, గుంజల్‌పహడ్ గ్రామాల్లోని చెరువులను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి వివరాలు సేకరించారు. అనంతరం చెరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువులోని ఒండ్రు మట్టిని వ్యవసాయ పొలంలో వేస్తే.. భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి పెరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ శ్వేత, ఏపీవో ప్రవళిక, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మారెడ్డి, దేవోజీ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసి ఆరేళ్లు!

- నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోని బీటీ రోడ్డు
- స్థల సేకరణే ప్రధాన సమస్య
- దీనిని అధిగమించి నిర్మాణం జరిగేనా?
- రెండు గ్రామాల ప్రజల్లో అనుమానాలు



బీటీ రోడ్డు నుంచి రెండు గ్రామాలకున్న మట్టి రోడ్డు

కొందుర్గు, మే, 17: బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించడానికి శంకుస్థాపన కూడా చేశారు. ఇదంతా జరిగి ఆరు సంవత్సరాలు అవుతోంది. కానీ, ఇప్పటి వరకు ఈ బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన సోమారం పాడులో 291మంది జనాభా ఉంది. వీరిలో 150మంది ఓటర్లు. వీరిలో ఎక్కువ మంది బీసీలే. గ్రామస్తులకు వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులే ఆధారం. పులుసుమామిడి శివారు గ్రామమైన అయ్యవారిపల్లిలో 55మంది జనాభా ఉంది. వీరిలో 28మంది ఓటర్లు. అయ్యవారిపల్లి గ్రామంలో ఉన్న వారందరూ దళితులే. ఈ రెండు శివారు గ్రామాలను జంట శివారు గ్రామాలుగా పిలుస్తారు. ఈ రెండు గ్రామాలను ఓ రోడ్డు విభజిస్తుంది. రోడ్డుకు ఒకవైపు సోమారంపాడు, రెండోవైపు అయ్యవారిపల్లి గ్రామాలున్నాయి. రెండు జంట శివారు గ్రామాలకు వెళ్లేందుకు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దాదాపు అర కిలోమీటర్ మట్టి రోడ్డు ఉంది. వర్షాకాలంలో దీనిపై నుంచి వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయం అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దృష్టికి తీసుకురావడంతో గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేశారు. దీంతో 2018 ఫిబ్రవరి 21న ఎస్‌డీఎఫ్ నిధులు 32లక్షలు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శంకుస్థాపన కూడా చేశారు. దీంతో తమ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం అవుతుందని భావించిన రెండు గ్రామాల ప్రజల ఆశలు చివరకు అడియాశలయ్యాయి. శంకుస్థాపన చేసి ఆరు సంవత్సరాలు అవుతున్నా రోడ్డు నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు.



శంకుస్థాపనకు వేసిన శిలాఫలకం

తేలని భూ సమస్య

ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జంట శివారు గ్రామాలైన సోమారంపాడు, అయ్యవారిపల్లి గ్రామాలకు రోడ్డు వేయాల్సిన స్థలం పట్టాభూమి కావడంతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా మారింది. రోడ్డు వేసేందుకు కావాల్సిన భూమి ఇవ్వాలని అధికారులు పట్టాదారులను అడిగారు. అయితే, భూమికి బదులుగా తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పట్టాదారులు కోరారు. అప్పట్లో అధికారులు సరే అనడంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కానీ అధికారులు పట్టాదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేయకపోవడంతో రోడ్డు వేసేందుకు పట్టాదారులు భూమిని ఇవ్వలేదు. దీంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తమ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం కావాలని జంట శివారు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, పట్టాదారులతో మాట్లాడి, బీటీ రోడ్డు నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూమి లేదా ఇంటి స్థలాలివ్వాలి



రోడ్డుకు ఇవ్వాల్సిన భూమిలో నలుగురం పట్టాదారులం ఉన్నాం. బీటీ రోడ్డు నిర్మాణం కోసం మా భూమిని తీసుకుంటే, మాకు ఇంటి స్థలాలు ఇవ్వాలని గతంలో అడిగాం. కానీ మాకు అధికారులు ఇవ్వలేదు. ప్రస్తుతం భూముల రేట్లు విపరీ తంగా పెరిగాయి. అందువల్ల బీటీ రోడ్డు నిర్మాణం కోసం మా పట్టా భూమిని తీసుకుంటే దానికి బదులుగా మా నాలుగు కుటుంబాలకు నాలుగెకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలి. ఇలా ఇస్తే మా భూమిని రోడ్డుకివ్వడానికి అభ్యంతరం లేదు.

- కె.రాములు, భూ పట్టాదారుడు, అయ్యవారిపల్లి.

శ్రీశైల మల్లన్న సన్నిధిలో తాండూరు ఎమ్మెల్యే



తాండూరు, మే 17: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో కొలువుదీరిన భ్రమరాంబ మల్లికార్జునస్వామిని శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దేవస్థానంలో అన్నదానం కోసం రూ.1,01,116లను విరాళంగా అందజేశారు.

నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు



ఉడిమేశ్వరం గ్రామపంచాయతీ సమీపంలో నిర్మించిన షెడ్

కొడంగల్ రూరల్, మే 17: సమున్నత లక్ష్యంతో నిర్మించిన కంపోస్టు షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లోని విధుల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులు పొలాల్లో వాడేందుకు విక్రయించి గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు ఆదాయం సమకూర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కంపోస్టు షెడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. కొడంగల్ మండలంలోని 26గ్రామ పంచాయతీల పరిధిలో, మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రూ.2లక్షల 50వేలతో ఒక్కో షెడ్‌ను నిర్మించారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి షెడ్లలో నిర్మించిన ప్రత్యేక తొట్లలో వేరు చేసి నిల్వ ఉంచాలి. వీధుల్లో సేకరించిన ప్లాస్టిక్ సంచులు, చెత్త పేపర్లు, పాత దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గాజు సీసాలు లాంటి వాటిని వేర్వేరు తొట్లలో నిల్వచేయాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొట్లలో చెత్తను నింపి వానపాములను వదిలినాణ్యమైన కంపోస్టు ఎరువుగా మారుతుంది. కానీ ఇలాంటి కార్యక్రమాలు ఏ పంచాయతీలో చేపట్టడంలేదు. దీంతో ప్రభుత్వం ఏ లక్ష్యంతో కంపోస్టు షెడ్‌లను నిర్మించిందో ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ శాస్త్రవేత్తల సందర్శన



దాదాపూర్ గ్రామాన్ని సందర్శించిన జాతీయ శాస్త్రవేత్త సత్యకుమార్ తదితరులు

దోమ, మే 17: దాదాపూర్ గ్రామ పంచాయతీకి 2023-24 సంవత్సరానికి గానూ జాతీయ పంచాయతీ అవార్డుకు ప్రతిపాదనలు పంపించగా శాస్త్రవేత్తలు సత్యకుమార్, శృతి, జయసుధ శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. ఫాంపాండ్స్, ఫిష్‌పాండ్, ఎమ్ఐ థాంక్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, మాజిక్ సోక్‌పిట్, హరిత హారం మొక్కలు, పార్కులేషన్ టాంక్స్, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, గ్రామీణ అభివృద్ధి అధికారి హెచ్.మహేశ్‌బాబు, ఎంపీడీవో సోమలింగం, ఎంపీవో సరళకుమారి, ఏపీడీ దస్తయ్య, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, వినోద్, రాజేశ్, వెంకట్ నర్సింహులు, మోహన్, సంతోష, అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఘట్‌కేసర్, మే 17: 'రాత్రికిరాత్రి పార్కు స్థలం మాయం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం పార్కుస్థలంలో నిర్మాణాలను కూల్చివేశారు. చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని శ్రీనివాస కాలనీలో పార్కుస్థలాన్ని మాయం చేశారని కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో పాటు ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డికి వివరించారు. ఈ మేరకు ఆంధ్రజ్యోతి కథనంపై వారు అధికారులను ఆరాతీయడంతో వెంటనే స్పందించిన మండల అధికారులు పంచాయతీ కార్యదర్శి శశికుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ పార్కుస్థలంలో నిర్మాణాలను కూల్చివేశారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంపూర్ణ ఆయుర్వేద నిలయంపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు



ఘట్‌కేసర్‌లోని సంపూర్ణ ఆయుర్వేద నిలయం (గోశాల)

ఘట్‌కేసర్, మే 17: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరెడ్డి రైల్వేవంతెన సమీపంలోని సంపూర్ణ ఆయుర్వేద నిలయం(గోశాల)లో రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో సంపూర్ణ ఆయుర్వేద నిలయం పేరుతో గోశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడికి నిత్యం వివిధ జబ్బులతో బాధపడుతున్న అనేక మంది వస్తుంటారు. ఉన్నట్టుండి గతనెల 6న రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేసి మధుమేహం చికిత్సకు ఆయుర్వేద ఔషదంగా వినియోగిస్తున్న అల్లోపతి డ్రగ్ పౌడర్ మిక్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయుర్వేదం పేరుతో మెట్‌పార్మిన్, గ్లిమోపిరాయిడ్, గ్లిక్లాజయిడ్ వంటి వాటిని మధుమేహానికి వాడుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇందుకు గానూ సంపూర్ణ ఆయుర్వేద నిలయం నిర్వాహకులకు ఈనెల 16వ తేదీన గురువారం డీసీఏ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఈవిషయమై ఆయుర్వేద నిలయం నిర్వాహకులు మాట్లాడుతూ.. మెడికల్ మాఫియా సూచనలతోనే తమపై దాడులు చేశారని వాపోయారు. ఏప్రిల్ 6వ తేదీన దాడులు చేసిన అధికారులు 15రోజుల్లో నోటీసులు ఇస్తామని చెప్పి నెల తర్వాత ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తంచేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మల్‌రెడ్డిని కలిసిన యాచారం మండల కాంగ్రెస్ నాయకులు

యాచారం, మే 17 : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని, బూత్‌ల వారీగా కార్యకర్తల వివరాలు తెలుసుకొని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం యాచారం మండల నాయకులు వి.తిరుమలేష్, యాదయ్య తదితరులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి వివిధ గ్రామాల కార్యకర్తల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ పార్టీ కోసం శ్రమపడిన నాయకులు, కార్యకర్తలు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా గెలవాలని సూచించారు. పార్టీ కోసం పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకందేలా చూడాలని సూచించినట్లు నాయకులు తెలిపారు.

ఆయిల్ డంప్ సెంటర్‌ను ఎత్తివేయాలి

● దుర్గంధంతో తండావాసుల ఇబ్బందులు ● మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



కొత్తూర్ తండా సమీపంలోని ఆయిల్ డంప్ సెంటర్

కొత్తూర్, మే 17: మున్సిపాలిటీలోని కొత్తూర్‌తండా సమీపంలో ఏర్పాటుచేసిన నిల్వ ఆయిల్ డంప్ కేంద్రాన్ని అక్కడి నుంచి ఎత్తివేయించాలని తండావాసులు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. యంత్రాలు, వాహనాల్లో వాడి వదిలివేసిన ఆయిల్‌ను ట్యాంకర్ల ద్వారా ఇక్కడకు తీసుకొచ్చి డంప్ చేస్తారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక్కడ కెమికల్స్ కలిపి తిరిగి ఇతర ప్రాంతాలకు తరలిస్తారని, రాత్రి సమయాల్లో దుర్వాసన వెదజల్లుతుండడంతో కంటి మీద కునుకు లేకుండా పోతుందన్నారు. వెంటనే ఆయిల్ కేంద్రాన్ని ఎత్తివేయించాలని తండావాసులు డిమాండ్ చేశారు. ఇందుకు కమిషనర్ బాలాజీ స్పందిస్తూ విచారణ జరుపుతామని తండావాసులకు హామీ ఇచ్చారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం



సిద్దాపూర్‌లో బ్రహ్మంగారి ఆరాధన పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కొత్తూర్, మే 17: మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీజగద్గురు, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి 331 ఆరాధన మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళాతాళాల మధ్య శాస్త్రోక్తంగా పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. విశ్వబ్రహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు గన్నోజు నవీన్‌చారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



చౌదర్‌పల్లిలో పాడైన భూగర్భ డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే 17 : తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి చౌదర్‌పల్లి పంచాయతీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చౌదర్‌పల్లి గ్రామంలో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. బీసీ కాలనీలో పాడైన భూగర్భ డ్రైనేజీని చూసి విస్తుపోయారు. త్వరితగతిన డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను బాగు చేయించాలని పంచాయతీ కార్యదర్శి జోత్స్నను ఆదేశించారు. తాగునీటిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వారం వారం విధిగా ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకును శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని చెప్పారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. మురుగు కాల్వలను వారం వారం విధిగా శుభ్రం చేయించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన హరితహారం నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ తీరు చూసి పంచాయతీ సిబ్బందిని అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాండూరు, మే 17: తాండూరు నియోజకవర్గంలో నేడు (శనివారం) విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి భానుప్రసాద్ తెలిపారు. యాలాల మండలం రాఘవపూర్, బాగాయిపల్లి, ధారూర్ మండలం నాగారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నదాత.. పొలం బాట



యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లిలో దుక్కులు దున్ని విత్తనాలు వేయడానికి పొలాన్ని సిద్ధం చేసిన రైతులు

- ఖరీఫ్‌కు దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ఎరువుల కొరత లేకుండా చర్యలు : వ్యవసాయాధికారి

యాచారం, మే 17 : ఖరీఫ్‌లో పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈమేరకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల వర్షాలు కురిశాయి. తమ్మలోనిగూడ, నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద, చౌదర్‌పల్లి, యాచారం, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, నందివనపర్తి, మేడిపల్లి తదితర గ్రామాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి. దాంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు మెట్ట పొలాల్లో దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా పత్తి వేసే రైతులు దుక్కుల్లో ఎరువులు చల్లి దుక్కి దున్నిస్తున్నారు. జొన్న, కంది పంటలు వేసే రైతులు పొలాల్లో ముళ్లకంప చెట్లు నరికి ఒకసారి కలియదున్నారు. ఇదిలా ఉండగా, భారీ వర్షాలు కురియగానే మరోమారు దుక్కులు దున్ని విత్తనాలు వేయడానికి అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 4,500 ఎకరాల్లో వరి, 1,500 ఎకరాల వరకు పత్తి, 400 ఎకరాల్లో కంది, 200 ఎకరాల్లో జొన్నపంట వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. 250 మెట్రిక్ టన్నుల యూరియా, 150 మెట్రిక్ టన్నుల డీఏపీ, 150 మెట్రిక్ టన్నుల 20:20:0, 28:28:28 కాంప్లెక్స్ ఎరువులు, 4 క్వింటాళ్ల జనుము, ఆరు క్వింటాళ్ల బీపీటీ, 4 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ వరి విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామన్నారు. యాచారం సొసైటీలో, మాల్‌లో కూడా ఎరువులు సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో బ్లాక్‌లో ఎరువులు, విత్తనాలు కొనరాదని రైతులను కోరారు. రైతుల కొనుగోలు చేసిన తర్వాత దుకాణాదారు నుంచి విధిగా రసీదు పొందాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐలు శంకర్‌కుమార్, నర్సింహారావులు తెలిపారు.



ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

వికారాబాద్, మే 17: అమ్మ ఆదర్శ పాఠశాలలో మే 30లోగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం చేపడుతున్న పనులను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి జరుగుతున్న పనులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ మాసంలో పాఠశాలలు తెరుచుకునేసరికి జరుగుతున్న అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. పనులు అన్నింటిని మే30లోగా పూర్తి చేసినందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పనుల్లో ఎలాంటి నాణ్యతాలోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదర్శ పాఠశాలల్లో కలర్ వేయడం, టాయిలెట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్‌లు ఉన్నారు.

పాఠశాలల్లో పనులను పూర్తి చేసేందుకు చర్యలు: రాహుల్‌శర్మ

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. వరి ధాన్యం సేకరణ, ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులు, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, ధరణిలో వచ్చిన అర్జీల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రెటరీ శాంతకుమారి జిల్లా కలెక్టర్‌లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, డీసీవో ఈశ్వరయ్య, డీఎల్పీవో సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యత లోపం లేకుండా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ వివరించారు. విద్యార్థుల ఏకరూప దుస్తుల(యూనీఫాంలు) తయారీ పూర్తి దశకు చేరుకున్నాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్‌లు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ధరణి, ముఖ్యమంత్రి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా పనిచేయాలన్నారు. సీఎం ప్రజావాణిలో భాగంగా జిల్లాకు 768దరఖాస్తులు వచ్చాయని, 722దరఖాస్తుల పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖలకు సమర్పించినట్లు తెలిపారు. మిగతా అర్జీలు వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. సంబంధింత శాఖలకు వచ్చిన దరఖాస్తులను పోర్టల్‌లో అప్డేట్ చేయాలన్నారు. సంబంధిత వివరాల కాపీలను కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా వరిధాన్యాన్ని సేకరిస్తున్నట్లు వారు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

ఇందిరమ్మ కమిటీల బాధ్యత ఎమ్మెల్యేలదే

- గ్రామస్థాయి, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఎంపిక
- ఇన్‌చార్జి మంత్రితో ఆమోద ముద్ర
- పార్లమెంటు ఎన్నికల తర్వాత ఉత్తర్వులు!

తాండూరు, మే 17: గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ కమిటీల ద్వారా ప్రభుత్వ పథకాలు అందజేయనుంది. ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు ప్రతీ ప్రభుత్వ పథకాన్ని ప్రజల్లో తీసుకెళ్లి అమలు చేసే బాధ్యత ఈ కమిటీలకు అప్పగించనున్నారు. అయితే ఈ కమిటీ ఏర్పాటుకు మార్గదర్శకాలు రావాల్సివుంది. గ్రామ స్థాయిలో ఒకకమిటీ, పట్టణాలలో వార్డులవారీగా కమిటీలను నియమించనున్నారు. ఒక్కో కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఏ పథకానికైనా అర్హుల ఎంపిక ఇందిరమ్మ కమిటీల ద్వారా జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్యే సిఫార్సు మేరకే..

ఐదుగురు సభ్యులను నియోజకవర్గ ఎమ్మెల్యే సిఫార్సు మేరకు నియమించనున్నట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్యే సిఫార్సు జాబితాకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదముద్ర వేస్తారు. తర్వాత ఈ కమిటీలు ఏర్పడుతాయి. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కమిటీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ముఖ్య నాయకులకు చోటుకల్పించే అవకాశాలున్నాయి.ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రూ.500లకు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఫ్రీ విద్యుత్) చేయూత, యువ వికాసం వంటి పథకాలు ఇతర అంశాలు ఈ కమిటీలే పర్యవేక్షించే అవకాశాలున్నాయి.

నైసర్గిక స్వరూపం

జిల్లా పేరు: వికారాబాద్
నియోజకవర్గాలు: 4
మున్సిపాలిటీలు: 4
మండలాలు: 18
గ్రామ పంచాయతీలు: 516
ఏర్పడే కమిటీలు :
మున్సిపాలటిలలో: 96 కమిటీలు
గ్రామాల్లో 565 కమిటీలు



పార్టీ శ్రేణులకు భాగస్వామ్యంతో పాటు బాధ్యత

పథకాల అమలులో పార్టీ శ్రేణులు భాగస్వామ్యంతో పాటు తప్పులు జరిగితే సరిదిద్దేందుకు అవకాశాలుంటాయనే ఉద్దేశంతో ఈ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. పథకాలన్నీ అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యతతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లే బాధ్యతలను ఇందిరమ్మ కమిటీలకు అప్పగించాలని సర్కారు భావిస్తోంది. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా ఏ సమస్య ఉన్నా దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే బాధ్యత ఈ కమిటీలకు ఉంటుంది.

వైఎస్సార్ హయాంలో..

గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసిన విషయం విధితమే. పెద్దఎత్తున గ్రామాల్లో ఈ కమిటీల ద్వారానే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. అంతేకాదు.. ప్రభుత్వ పథకాలను ఈ కమిటీల ద్వారా అమలు చేసి కార్యకర్తలు, నాయకులకు ప్రాతినిధ్యం వహించారు.



శంకర్‌పల్లి శ్మశానవాటికలో పేరుకు పోయిన చెత్త

అధికారుల నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం

- పారిశుధ్య లోపంతో పేరుకుపోతున్న చెత్త

శంకర్‌పల్లి, మే 17 : అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్యంపై ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. లక్షలు వెచ్చించి పారిశుధ్య నిర్వహణ కోసం నడుం బిగించినా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దాదాపు నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం రూ.15 లక్షలు వెచ్చించి శంకర్‌పల్లి మున్సిపాలిటీకి ఇన్సినరేటర్(చెత్తను దహనం చేసే యంత్రం)ను అందజేసింది. మున్సిపల్ అధికారులు శంకర్‌పల్లి చెత్త డంపింగ్‌యార్డులో పెట్టాలని అనుకున్నా.. అక్కడ హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో ఏర్పాటు చేయలేదు. దాంతో మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ వైకుంఠధామంలో ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. ఆ యంత్రం అక్కడ వృథాగా ఉండటంతో తుప్పు పట్టి పనిచేయకుండా పోతోంది. ప్రతీరోజు మున్సిపాలిటీలో చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించడంతో చెత్త గుట్టలా పేరుకుపోతోంది. డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను దహనం చేస్తుండటంతో చుట్టుపక్కల వారికి, వాతావరణానికి ముప్పు వాటిల్లుతోంది. డంపింగ్ యార్డు చుట్టుపక్కల నిత్యం దట్టమైన పొగ అలుముకుంటుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగాపూర్-బీడీఎల్ ఫ్యాక్టరీ లింక్ రోడ్డు వెంట వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. డంపింగ్‌యార్డులో చెత్తపేరుకు పోయి.. అది కాస్తా లింక్‌రోడ్డుపై పారబోస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారలుఉ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ఇన్సినరేటర్‌ను సమకూర్చినా అధికారులు నిరుపయోగంగా వదిలేశారు. డంపింగ్ యార్డుకు తరలించిన చెత్తలో నుంచి ప్లాస్టిక్, ఇనుప వస్తువులను వేరుచేసి మిగిలిన చెత్తను ఇన్సినరేటర్ యంత్రంలో దహనం చేయాల్సి ఉంటుంది. వాతావరణం కాలుష్యం కాకుండా చెత్తను బూడిద చేయడం ఈ యంత్రం ప్రత్యేకత. అధికారులు స్పందించి ఇన్సినరేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా యంత్రాన్ని త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామని సమాధానం ఇచ్చారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాత్రికేయుడు వెంకటయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సీఎంకు వినతి

బొంరాస్‌పేట్, మే 17: సీనియర్ పాత్రికేయుడిగా 30 సంవత్సరాలుగా సేవలు అందించిన బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి చెందిన ఉప్పరి వెంకటయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని టీయూడబ్ల్యూజే యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎంను యూనియన్ నాయకులు కిషన్‌రావు, పకీరప్ప, ప్రసాద్, రాకేశ్, పృథ్వీరాజ్, రమేశ్, నరేశ్ శ్రీనివాస్‌గౌడ్, నర్సిములు తదితరులు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం తరపున ఉప్పరి వెంకటయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, రాఘవేందర్, ప్రభాకర్, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 17: జిల్లాలో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం 16 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. హమాలీల కొరత ఉందంటూ పలుచోట్ల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నందున రైతులు కుప్పలుగాపోసి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారని, అధికార యంత్రాంగం ముందుచూపు లేకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందన్నారు. ఇప్పటికీ జిల్లాలో కేవలం 6.28 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని, ఇంకా 50 శాతం ధాన్యం కల్లాల్లోనే ఉందన్నారు. రైతులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రూ.2లక్షల రైఉతు రుణమాఫీ చేయలేదని, రైతులతోపాటు కౌలు రైతులకు రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వలేదంటూ విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయలేయకపోవడంతో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు బీమా అందక తీవ్రంగా నష్టపోయారని, ఈ ప్రభుత్వమైనా ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలంటూ వారు సలహా చేశారు. తాము అధికారంలోకి వస్తే హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీని రద్దు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఈ విషయంపై సీఎం వెంటనే ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డిలు పాల్గొన్నారు.

నీటికుంట కాదు.. మార్కెట్ యార్డు

- వర్షానికి గుంతలమయమైన వ్యవసాయ మార్కెట్
- నీటి గుంతల్లోనే ధాన్యం విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



పరిగి వ్యవసాయ మార్కెట్‌లో వర్షపు నీటి గుంతల మధ్య ధాన్యం విక్రయాలు

పరిగి, మే 17: ధాన్యం లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు నీటి కుంటలో దిగాయేంటని అనుకుంటున్నారా..? నిజానికి పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద దుస్థితి ఇది. మార్కెట్ యార్డు ఎదురుగా గుంతలు ఏర్పడి ఇబ్బందికరంగా మారింది. చిన్నపాటి జల్లులు కురిస్తేనే నీటికుంటను తలపిస్తోంది. ఇక భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేమని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికే మార్కెట్‌యార్డులో దుకాణాల ముందు నీళ్లు నిలిచాయి. పరిగి మార్కెట్ యార్డులో ప్రతీ శుక్ర, శనివారాల్లో ధాన్యం క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. శుక్రవారం ధాన్యం బస్తాలను దింపేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సివచ్చింది. ఇదిలా ఉండగా మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదాయంపై పెడుతున్న శ్రద్ధ రైతులకు సరైన వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని స్పష్టమవుతోంది. ధాన్యం బస్తాలతో గుంతల్లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గతంలో సీసీరోడ్డు నిర్మాణాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం వల్లే ఇలా జరుగుతోందని చెబుతున్నారు. నీళ్లు వెళ్లకుండా సీసీరోడ్డును ఎక్కడబడితే అక్కడ నిర్మాణాలు చేపట్టడం వల్లే నీరు నిలుస్తోందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో ఇక్కడ మరమ్మతులు నామమాత్రంగా చేపట్టడంతో ఇప్పుడు ఈ సమస్య తీవ్రంగా మారిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మార్కెట్ యార్డును బాగుచేయించాలని కోరుతున్నారు.



రాయితీపై అందుబాటులో విత్తనాలు

బొంరాస్‌పేట్, మే 17: ఉమ్మడి బొంరాస్‌పేట్ మండలంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగ విత్తనాలు తుంకిమెట్ల, దుద్యాల, బొంరాస్‌పేట్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు ఏవో అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పచ్చి రొట్ట విత్తనాలను పొలాల్లో చల్లుకొని 45రోజులకు దమ్ము చేసుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలను వాడటంతో కలుపు మొక్కలను, జింక్ లోపాన్ని నివారించడంతో పాటు భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. సబ్సిడీ పోను రైతుకు 40కేజీల జనుము విత్తన బస్తా రూ.1448, జీలుగ బస్తా 30కేజీల ధర రూ.1116 ఉంటుందని తెలిపారు. మండలంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దౌల్తాబాద్: రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు ఏఈవో శ్రీపతిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నందారం క్లస్టర్‌లోని నీటూర్, మాటూర్, కౌడీడ్, నర్సాపూర్ రైతులకు శనివారం ఉదయం 10 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

తల్లిని మించిన దైవం లేదు

- వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి

ఆమనగల్లు, మే 17: తల్లిని మించిన దైవం లేదని, ఆమె త్యాగం వెలకట్టలేనిదని, ప్రతీ వ్యక్తి ఎదుగుదలలో తల్లి పాత్ర కీలకమని వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భట్టు నర్సిరెడ్డి అన్నారు. మాడ్గుల మండలం కొత్తబ్రాహ్మణపల్లి రెయిన్‌బో స్కూల్‌లో శుక్రవారం అమ్మపాద పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరంలో భాగంగా తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి భట్టు నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 380 మంది విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. చిత్తరంజన్ దాస్ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రేమకు సమాజంలో మరెవరు సాటి రారని అన్నారు. బిడ్డల భవిష్యత్తు కోసం అమ్మ వర్తమానాన్ని త్యాగం చేస్తుందని, జయ, అపజయాల్లో తోడుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శంకర్, వందేమాతరం ఫౌండేషన్ సభ్యుడు భట్టు అనంత రెడ్డి, శృతిలయ కల్చరల్ అకాడమీ కార్యదర్శి వనం విజయ్‌కుమార్, సభ్యులు శ్రీశైలం, రాజు, శ్రీను, శేఖర్, మమత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



పంటను పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్ రూరల్, మే 17: అయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడితో పాటు రెట్టింపు ఆదాయం వస్తుందని ఆయిల్‌పామ్ సాగు రాష్ట్ర సలహాదారులు డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల రైతు వేదికలో శుక్రవారం అయిల్‌పామ్ సాగుచేసిన, త్వరలో చేపట్టబోయే రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిల్‌పామ్ పంట ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుంటుందని తెలిపారు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ఎకరానికి 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, సుమారు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందన్నారు. పామాయిల్ పంటలో మూడు సంవత్సరాల పాటు ఇతర అంతర పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. కూరగాయలు, మొక్కజొన్న, పత్తి, కంది, అరటి, బొప్పాయి వంటి వాటిని సాగు చేసుకోవచ్చని తెలిపారు. మూడున్నర ఏళ్లకు పంట ప్రారంభమవుతుందని, 30 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుందని వివరించారు. నీటివసతి ఉన్న ప్రతీ రైతు పంటను సాగు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నీరజా గాంధీ మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు పాటించాలని తెలిపారు. పామాయిల్ పంటకు రాయితీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రాజారత్నం, షాద్‌నగర్ ఉద్యానవన శాఖ అధికారి ఉషారాణి, ఏఈవో రమణ తదితరులు పాల్గొన్నారు

నేడు అవగాహన సదస్సు

కందుకూరు : నేడు(శనివారం) కందుకూరు రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న ప్రతీ రైతుకు అధిక లాభాలు వస్తున్నట్లు తెలిపారు. దీనికిగాను ప్రభుత్వం ఆ పంటను సాగు చేస్తున్న రైతులకు ఇచ్చే రాయిలపై కందుకూరు రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి డీహెచ్‌ఎస్‌వో నీరజగాంధీ, ఏడీహెచ్ సంజయ్‌కుమార్, ఏడీఏ సుజాత, ఆయిల్‌పామ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామమోహన్‌రావు, మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య, ఏఈవో రాజు, ఎఫ్‌వో మల్లేష్‌లు హాజరవుతున్నట్లు సౌమ్య తెలిపారు. ఈ అవకాశాన్ని కందుకూరు క్లస్టర్‌లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్ల/ఆమనగల్లు, మే 17 : చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొనుటకు మొదటి విడత ఆప్షన్ పెట్టుకొనుటకు ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులో ఉందన్నారు. ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఈనెల 20వ తేదీ వరకు పెట్టుకోవచ్చన్నారు. కోర్సుల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీ కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆమనగల్లు పట్టణానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీపాద శర్వాణి తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరానికి గాను బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో 60 సీట్ల చొప్పున 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సీఎం రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మే 17: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులంత ఐక్యంగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ప్రభుత్వంలో తగిన గుర్తింపు కల్పిస్తామని తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అభివృద్ధిలో కల్వకుర్తి నియోజకవర్గానికి పెద్ద పీట వేయాలని సీఎం రేవంత్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, అసిఫ్ అలీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, మే 17: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 18న మండలంలోని పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రమేష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గల విద్యుత్ సబ్‌స్టేషన్లలో నేడు(శనివారం) ఉదయం 6గంటల నుంచి ఉదయం 9గంటల వరకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. గుమ్మడవెల్లి టౌన్, మఖాన్, ముచ్చర్లటౌన్, లేమూరు టౌన్, గూడూరు టౌన్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అంతరాయాన్ని సహకరించాలని కోరారు.

షాబాద్ మండలంలో..

షాబాద్, మే 17 : నేడు(శనివారం) షాబాద్ మండలంలో చందన్‌వెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్ తెలిపారు. చందన్‌వెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చందన్‌వెల్లి, పెద్దసోలిపేట్, చిన్నసోలిపేట్, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, చందన్‌వెల్లి ఇండస్ట్రీయల్ పార్క్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తలకొండపల్లి , మే 17: తలకొండపల్లి మండల సర్వ సభ్య సమావేశం నేడు(శనివారం) ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరవ్వాలన్నారు.

21 నుంచి నృసింహస్వామి జయంత్యుత్సవాలు



రవీంద్ర సాగర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న భక్త బృందం

ఇబ్రహీంపట్నం, మే 17: ఇబ్రహీంపట్నంలో ఈ నెల 21 నుంచి మూడు రోజులపాటు జరగనున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు, కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలంటూ దేవస్థానం భక్తబృందం పలువురికి ఆహ్వానాలు అందించింది. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సాగర్, ఏసీపీ కేపీవీ రాజులను కలిసి బృందం సభ్యులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కూడా కలిసి కల్యాణానికి హాజరుకావాలని కోరారు.

1.92 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం

● తలకొండపల్లి మండలంలో 32 నర్సరీల ఏర్పాటు
● పండ్లు, పూలు, టేకు, నీడనిచ్చే మొక్కల పెంపకం
● హరితహారంలో భాగంగా జీపీల వారీగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక సంసిద్ధం



చౌదర్‌పల్లి నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

తలకొండపల్లి, మే 17: హరితహారం కార్యక్రమంలో భాగంగా తలకొండపల్లి మండలంలో 2024-25 సంవత్సరానికి గాను 1.92 లక్షల మొక్కల పెంపకానికి మండల అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్యాల పూర్తికి మండల పరిషత్, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టి వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ఈజీఎస్, అటవీశాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా నర్సరీలను ప్రారంభించారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో 6 వేల మొక్కలు నాటాలని ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకనుగుణంగా 32 నర్సరీల ద్వారా 1.92 లక్షల మొక్కలు పెంచుతున్నారు. తలకొండపల్లి మండలంలోని 32 పంచాయతీలలో నర్సరీలు ఏర్పాటు చేశారు. రైతుల పొలాల్లో వారి భాగస్వామ్యంతో నర్సరీలు చేపట్టారు. ఈజీఎస్ ద్వారా నర్సరీలు కొనసాగుతున్నాయి. ఇటు రైతులకు ప్రయోజనం కలుగడంతో పాటు ఒక్కో నర్సరీలో మొక్కల పెంపకాన్ని బట్టి కూలీలకు ఉపాధి లభిస్తోంది. వర్షాకాలం ప్రారంభం నాటికి పెంచుతున్న మొక్కలను నాటడానికి సిద్ధం చేస్తున్నారు. నర్సరీలను ఎంపీడీవో శ్రీకాంత్, ఈజీఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

లక్ష్యాల పూర్తికి చర్యలు



తలకొండపల్లి మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 32 నర్సరీలలో 1.92 లక్షల మొక్కలు పెంచుతున్నాం. వర్షాకాలం నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే 60 శాతం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాం. ఎండలకు వాడిపోయి మొలకలు రాని చోట మళ్లీ గింజలు పెట్టి మొక్కలు పెంచుతున్నాం. పంచాయతీలవారిగా నాటే మొక్కల టార్గెట్లను నిర్ణయించాం. నూటికి నూరుశాతం లక్ష్యాల పూర్తికి కృషి చేస్తున్నాం. ప్రజలందరు హరితహారంలో పాల్గొని విజయవంతం చేయాలి.

- శ్రీకాంత్, ఎంపీడీవో, తలకొండపల్లి

'పౌల్ట్రీ' ఆస్తి పన్ను బకాయిలను రద్దు చేయండి

● సీఎం, మంత్రికి ఎమ్మెల్యే వీర్లపల్లి వినతి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మే 17: వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పౌల్ట్రీ రంగానికి సంబంధించిన ఆస్తి పన్ను పాత బకాయిలను రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులకు వినతిపత్రాలను ఇచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యను సీఎం, మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని, వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కాగా, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీని వ్యవసాయ అనుబంధ రంగంగా గుర్తించి, ఆస్తి పన్నును రద్దు చేశారని గుర్తుచేశారు. అయితే, ఫరూఖ్‌నగర్ మండలంలోని చటాన్‌పల్లి, సోలీపూర్ గ్రామ పంచాయతీలను షాద్‌నగర్ మేజర్ గ్రామ పంచాయతీలో చేర్చి 2011 ఆగస్టు 24న మున్సిపాలిటీగా మార్చారని, అప్పటికే చటాన్‌పల్లి శివారులో ఉన్న బీవీరావు నగర్, సోలీపూర్ శివారులోని పౌల్ట్రీలు షాద్‌నగర్ మున్సిపాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. మున్సిపాలిటీలో ఉన్న పౌల్ట్రీలకు ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్లు పౌల్ట్రీ రైతులపై ఒత్తిడి చేసి, వారు చెల్లించకపోవడంతో కోర్టు నుంచి నోటీసులను ఇచ్చారని తెలిపారు. రైతుల కోరిక మేరకు పౌల్ట్రీ, పాడిరంగాల షెడ్లకు ఆస్తి పన్నును రద్దు చేస్తూ 2021 జూన్ 2న గత ప్రభుత్వం 92 జీవోను విడుదల చేసిందన్నారు. అయితే జీవోలో పాత బకాయిలను ప్రస్తావించకపోవడంతో మున్సిపాలిటీ సిబ్బంది రైతులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఆస్తి పన్నును రద్దు చేసినప్పుడు బకాయిలను కూడా రద్దు చేయాలని కోరినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ వివరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



కేశంపేట తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మహ్మద్ షకీల్

కేశంపేట, మే 17: మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామ శివారులోని సర్వేనంబర్ 27లో గల మూడెకరాల 16 గుంటల సర్కారు, పోరంబోకు భూమిని కాపాడాలని కోరుతూ కేశంపేట మండల తహసీల్దార్ మీర్ ఆజం అలీకి శుక్రవారం సంగెం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మహ్మద్ షకీల్ వినతిపత్రం అందజేశారు. 1974లో భూ రికార్డులో సర్వేనంబర్ 27లో సర్కారు, పోరంబోకు అని నమోదై ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొందరు అక్రమార్కులు పథకం ప్రకారం.. గ్రామానికి చెందిన భూస్వాముల పేర్లు నమోదు చేసి, వారి నుంచి భూమిని రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా తమ పేర్లపై నమోదు చేయించుకున్నారని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన భూమిని గతంలోనే దత్తాయపల్లి గ్రామ పెద్దలు తమ ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించాలని కోరినట్లు పేర్కొన్నాడు. ప్రస్తుతం పట్టాదారుగా చలామణి అవుతున్న అక్రమణదారులు తిరిగి భూమిని అమ్మేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి భూమిని పేదలకు పంచాలని కోరాడు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ప్రవీణ్‌చారి మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ

ఆమనగల్లు, మే 17 : పిడుగు పాట్లకు గురై మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కడ్తాల మండలం వాసుదేవ్‌పూర్ గేటు వద్ద పిడుగు పాటుకు గురై మృతి చెందిన మాడ్గుల మండలం కలకొండ గ్రామానికిచెందిన పసునూరి ప్రవీణ్ చారి మృతదేహాన్ని శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా పిడుగు పాటుకు గాయపడి వెల్దండ సమీపంలోని యెన్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద మాడ్గుల కు చెందిన గౌని నిరంజన్‌గౌడ్ ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. చికిత్స నిమిత్తం రూ.5 వేలు సాయమందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో పిడుగు పాట్లకు కావటి పద్మమ్మ, పసునూరి ప్రవీణ్‌చారి మృతి చెందిన సంఘటనల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరగా ఆయా కుటుంబాలకు తగిన సాయమందేలా చూస్తానన్నారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. పంటలు నష్టపోయిన రైతులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అధికారులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కసిరెడ్డి సూచించారు. విద్యుత్ అధికారులు కూడ అప్రమత్తంగా ఉండాలని, స రఫరాలో అంతరాయం కలుగకుండ చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూదిని కొండల్ రెడ్డి, గొర్రె రవీందర్ రెడ్డి, జంగయ్య, శ్రీకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, దళపతి, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు ఇవ్వాలి

షాద్‌నగర్ అర్బన్, మే 17: రోడ్డు విస్తరణలో భాగంగా స్థల మార్పు చేసిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి మంజూరు చేసిన నిధులు ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామస్థులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం తెలుగు దేశం పార్టీ లింగారెడ్డిగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎ. భాస్కర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతి పత్రాన్ని ఇచ్చారు. తమ గ్రామ సమీపంలోని పాత జాతీయ రహదారికి అనుకుని పురాతన ఆంజనేయస్వామి ఆలయం ఉండేదని, కొత్తూర్ నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా పాత ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించి, రోడ్డు పక్కనే కొత్త ఆలయాన్ని నిర్మించడానికి రూ.7లక్షలు మంజూరు చేయించినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి గ్రామానికి వచ్చి చెప్పారని వారు పేర్కొన్నారు. గత ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సూచన మేరకు రోడ్డు విస్తరణకు సహకరించారని, ఆంజనేయస్వామి పాత గుడిని తొలగించి, రోడ్డు పక్కన నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. రూ.7లక్షల్లో మూడున్నర లక్షలు మాత్రమే ఇచ్చి, మిగిలిన మూడున్నర లక్షలు ఇవ్వకుండా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వారంరోజుల్లో ఇస్తామన్న నిధులు ఇవ్వకపోతే.. ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడమే కాకుండా షాద్‌నగర్ చౌరస్తా నుంచి బైపాస్ వరకు కాంట్రాక్టర్ చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను అడ్డుకుంటామని భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

● ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే 17 : అర్హులందరికీ ఉపాధి కల్పించాలని, పనులు వేగవంతంగా పూర్తిచేయాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి లేదని ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేయకుండా చూసుకోవాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించి కొలతలను తరచూ పర్యవేక్షించాలని, వందశాతం పన్ను ల వసూళ్లపై దృష్టి సారించాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వానాకాలంలో డయేరియా, అతిసార లాంటి వ్యా దులు ప్రబలకుండా వైద్యసిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. ఇటీవల జరిగిన సోషల్ ఆ డిట్‌లో జరిగిన తప్పిదాలను గమనంలో పెట్టుకొని తప్పులు జరగకుండా చూసుకోవాలన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన 108 అంబులెన్స్ సిబ్బంది

యాచారం, మే 17 : మండల కేంద్రంలో ఓ మామిడితోట వద్ద సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డుపై స్పృహ తప్పి పడి ఉన్న వ్యక్తి ప్రాణాలను 108 అంబులెన్స్ సిబ్బంది శుక్రవారం కాపాడారు. మండలంలోని నానక్‌నగర్‌కు చెందిన చందర్(40) దారి వెంట నడుస్తూ డీఎస్‌ఆర్ గార్డెన్ సమీపంలో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు చందర్‌ను పరిశీలించి యాచారం పోలీసులకు, 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారమందించారు. అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సకాలంలో స్పందించడంతో వ్యక్తి ప్రాణాలు దక్కాయని స్థానికులు తెలిపారు. అంబులెన్స్ సిబ్బందిని వారు అభినందించారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

తలకొండపల్లి, మే 17: మొక్కల పెంపకం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా బావించాలని దేవుని పడకల్ మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం అన్నారు. మొక్కల పెంపకం పైనే పర్యావరణ పరిరక్షణ, భావితరాల మనుగడ ఆధార పడి ఉందని ఆయన పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం దేవునిపడల్ గ్రామంలోని హరితహారం నర్సరీని శుక్రవారం శ్రీశైలం సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఎండల నేపథ్యంలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండ చూడాలని నిర్వాహకులకు సూచించారు. వర్షాకాలం నాటికి మొక్కలు నాటేందుకు స్థలాలను సిద్ధం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ముమ్మరంగా దుకాణ సముదాయ నిర్మాణం

ఆమనగల్లు, మే 17 : ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలో దుకాణ సముదాయ నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నెల రోజుల్లో దుకాణాలను నిర్మించి పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో 8 దుకణాల సముదాయనికి రూ.65 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. దుకాణాల నిర్మాణానికి 2023 ఆగస్టు 18న అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎన్నికల కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగిన ఇటీవల మళ్లీ ప్రారంభించి వేగవంతం చేశారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సూపర్ వైజర్ శ్రీశైలం పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దుకాణ నిర్మాణం పూర్తైతే మార్కెట్ కు ఆదాయం లభించడంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుంది.

అంతరించిపోతున్న కళలకు జీవం పోయాలి



కళాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బక్కి కుమార్

తలకొండపల్లి, మే 17 : అంతరించిపోతున్న గ్రామీణ కళలకు జీవం పోసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. కవులు, కళాకారులకు ప్రభుత్వాలతో పాటు ప్రతీ ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఇటీవల శ్రీ సీతారామాంజనేయ కళానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించి శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం కళాకారులకు శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్య నాటకం కళాకారులను ఈ సందర్భంగా బక్కి కుమార్ సత్కరించి అభినందించారు. కళాకారులకు ప్రోత్సహకంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో ఐదు దశాబ్దాలుగా అనేక మంది కళలకు జీవం పోస్తుండడం అభినందనీయమన్నారు. ప్రజా చైతన్య కార్యక్రమాల్లో కళాకారులు పాలు పంచుకోవాలన్నారు. కళాకారులు దామోదర్ రెడ్డి, చిత్తరంజన్, అయ్యప్ప చారి, నర్సింహ్మాగౌడ్, నరేశ్, విష్ణుమూర్తి, రమేశ్, జంగయ్య, మనోహర్, శివానంద్, కొమురయ్య, గణేశ్, యాదగిరి రెడ్డి, తిరుపతయ్య, నాయకులు ప్రసాద్, నాగులు, నర్సింహగౌడ్, రాజు, తదితరులున్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా.. నల్లబెల్లం, పటిక స్వాధీనం

● కారును వెంబడించిన పోలీసులు
● బోల్తాపడిన కారు.. నల్లబెల్లం, పటిక పట్టివేత



ఘటనా స్థలంలో కారు.. నల్లబెల్లం, పటిక సంచులు

ఆమనగల్లు, మే 17 : పోలీస్ పెట్రోలింగ్‌లో భాగంగా గురువారం రాత్రి ఆమనగల్లు పోలీసులు శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ కారును అనుమానంతో ఆపేందుకు యత్నించగా డ్రైవర్ ఆపలేదు. మితిమీరిన వేగంతో కారును నడుపుకుంటూ వెళ్లాడు. దాంతో మండల పరిధిలోని రాంనుంతల గ్రామ శివారులో కారు పల్టీ కొట్టింది. ఏఎస్సై బాల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు సమీపంలో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఓ కారు డ్రైవర్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి కారు వేగాన్ని ఒక్కసారిగా పెంచడంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును వెంబడించారు. దాంతో కొద్ది దూరం వెళ్లాక కారు బోల్తాపడగా డ్రైవర్ పరారయ్యాడు. కారు(ఏపీ 09 బీఆర్ 2779)ను పరిశీలించగా అందులో 19 సంచులు సారాయి తయారీకి ఉపయోగించే ముడిసరుకు ఉంది. 16 సంచులు నల్లబెల్లం, 3 సంచుల్లో పటిక ఉన్నట్లు ఎస్సై బాల్‌రామ్‌నాయక్ తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల యువతి, యువకుడు అదృశ్యం

యాచారం, మే 17 : వేర్వేరు చోట్ల యువతి, యువకుడు అదృశ్యమైన ఘటన శుక్రవారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈమేరకు మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన లావణ్య బుధవారం తల్లి బట్టలు ఉతుకుతుండగా.. ఇప్పుడే వస్తానని తల్లితో చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిందని బంధువులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, అదే గ్రామానికి చెందిన కల్యాణ్‌తో ఆమె పారిపోయి ఉంటుందని లావణ్య కుటుంబికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. అదేవిధంగా తల్లితో గొడవ పడి ఓ యువకుడు ఇంటి నుంచి పారిపోయిన ఉదంతం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతపట్లలో చోటుచేసుకుంది. చింతపట్లకు చెందిన రాఘవేందర్ గురువారం రాత్రి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. అనంతరం తనమాట విననప్పుడు నేనెందుకు ఇంట్లో ఉండాలని కుటుంబికులతో వాదనకు దిగాడు. రాత్రివేళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని రాఘవేందర్ తండ్రి శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

అక్రమంగా భూ రిజిస్ట్రేషన్ కేసులో మరొకరి రిమాండ్

చౌదరిగూడ, మే 17: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఓ రైతు బతికి ఉండగానే చనిపోయాడని ఫేక్ డాక్యుమెంట్‌తో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన కేసులో మరొకరిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట్ గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్య చనిపోయినట్లు 2023 జూన్‌లో ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి ఇతరులకు విరాసత్ చేశారు. ఈ ఘటనలో జిల్లేడ్ చౌదరిగూడ తహసీలార్దుతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మొదటగా ఇద్దరు మహిళలను అరెస్టు చేయగా.. శుక్రవారం ఈరని జంగయ్య అనే వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


అంతయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి



యాచారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

యాచారం, మే 17 : లారీడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మరణించిన అంతయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మృతుడి బంధువులు, కుటుంబికులు యాచారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. దాంతో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, ఇటీవల రోడ్డు జరిగిన ప్రమాదంలో అంతయ్య మరణానికి కారణమైన మహా సిమెంట్ కంపెనీ లారీ డ్రైవర్‌ను తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబం కడు పేదరికంలో ఉందని, తగిన న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. సీఐ శంకర్‌కుమార్, ఎస్సైలు గోపాల్, వెంకటనారాయణ, సత్యనారాయణలు వారితో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా శాంతించి అక్కడి నుంచి వెనుదిరిగారు.

రాయ్‌బరేలి ఎన్నికల ప్రచారంలో మల్లు రవి



ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు

ఆమనగల్లు, మే 17 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మల్లు రవి, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయ్‌బరేలి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి మద్దతుగా దర్యాపూర్ గ్రామంలో ప్రచారం చేపట్టినట్లు మల్లు రవి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో యూపీలో ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని, రాహుల్ గాంధీ 5 లక్షల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేగారెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరితతిరుపతయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, గివర్ధన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

శంకర్‌పల్లి : విద్యార్థి లేఖ్య వర్ధితపై యాసిడ్ దాడి జరిగిందనే వార్తల్లో నిజం లేదని ఇక్ఫాయ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ఎస్ గణేశ్, రిటైర్డ్ కల్నల్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దొంతాన్‌పల్లిలోని వర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కళాశాలలో బీబీఏ(ఎల్ఎల్‌బీ) తృతీయ సంవత్సరం చదువుతున్న లేఖ్య వర్ధిత ఈనెల 15న ఉదయం 7:30 గంటలకు హాస్టల్ గదిలో స్నానం చేసేందుకని వేడినీరు ఒంటిపై పోసుకోగా శరీరం కాలిందన్నారు. వెంటనే సెక్యూరిటీ గార్డ్‌తో పాటు, వార్డెన్‌కు విషయం తెలిపిందన్నారు. కళాశాలలోని ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం కళాశాలకు చెందిన అంబులెన్స్‌లో గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించామన్నారు.